క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు నవ్యశ్రీ


నవ్యశ్రీ

నగరి : మండలంలోని ముడిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికై ంది. శుక్రవారం ఈ మేరు విద్యార్థినితోపాటు కోచ్ ఆనందమోహన్‌ను ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ అభినందించారు.

కబడ్డీ పోటీలకు నింద్ర విద్యార్థి


రోహిత్‌గాంధీ

నింద్ర: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9 తరగతి విద్యార్థి జి. రోహిత్ గాంధీ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం పుత్తూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రోహిత్‌గాంధీ ప్రతిభను కనబరచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పీడీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నాగరాజుకుప్పం విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నగరి : మండలంలోని నాగరాజు కుప్పం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు మమత, నీరజ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే 9వ తరగతి విద్యార్థిని జ్యోషా సైతం కబడ్డీ పోటీలకు ఎంపికైంది. విద్యార్థినులు, పీడీ చెన్నకేశవరెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు మునిరత్నం, ఉపాధ్యాయుడు రవిశేఖర్ పాల్గొన్నారు.

కాలభైరవుని 'విశ్వరూపం'

నగరి : మహాకాళభైరవ అష్టమిని పురస్కరించుకుని శుక్రవారం కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో కాలభైరవ స్వామికి విశ్వరూప అలంకారం చేశారు. పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విభూదితో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌ను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి


జయరామయ్య (ఫైల్)

విజయపురం : మండలంలోని కేశవపురం ఆదిఆంధ్రవాడకు చెంది న వైఎస్సార్‌సీపీ సీనియ ర్ నేత జయరామయ్య (70) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయ న కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన మృతికి మాజీ మంత్రి ఆర్‌కే రోజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబీకులకు సంతాపం తెలిపారు. శని వారం సాయంత్రం జయరామయ్య అంత్యక్రియల్లో మాజీ మంత్రి పాల్గొననున్నారు.

ఎస్‌ఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల నిర్వహణపై సంతృప్తి


క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్‌జేడీ గిరి

పుత్తూరు: ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని విభాగాల పనితీరు సంతృప్తికరంగా ఉందని విద్యాశాఖ రాయలసీమ జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ గిరి తెలిపారు. శుక్రవారం కళాశాలలో పరిపాలన సంబంధమైన తనిఖీలు నిర్వహించారు. విద్యా సంబంధమైన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధితో పాటు న్యాక్‌లో మంచి గ్రేడింగ్ సాధించడానికి తగిన సూచనలు చేశారు. అంతర్ కళాశాల క్రీడల్లో ప్రథమ స్థానం పొందిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం


సూచనలిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలోని ఆక్రమణలను తొలగించాలని పురపాలక కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రధాన వీధులు, టవర్ క్లాక్ సెంటర్‌లో పర్యటించారు. రోడ్డు మార్జిన్లు ఆక్రమించిన వారు స్వయంగా తొలగించుకోవాలని సూచించారు. లేకుంటే పురపాలక సిబ్బంది తొలగిస్తారని హెచ్చరించారు. దుకాణాల ముందు చెత్త పడేయకూడదని, పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీఓ వీఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగించిన దృశ్యం

విజయపురం : కోసలనగరం దళితవాడలో విద్యుత్ తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. 'సాక్షి'లో శుక్రవారం 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు.

నిరుపయోగంగా 'సంపద' కేంద్రాలు

విజయపురం మండలంలోని ప్రతి పంచాయతీలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయి. మరి కొన్నిచోట్ల అలంకారప్రాయంగా మారిపోయాయి. ఫలితంగా ఎక్కడ చూసినా మురుగు కాలువలు, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్, గాజుసీసాలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి.

- నిలిచిపోయిన వర్మీకంపోస్టు ఉత్పత్తి
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
- గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం



అలంకారప్రాయంగా డంపింగ్ యార్డు (ఇన్‌సెట్) శిథిలావస్థలో చెత్త సేకరణ రిక్షా

విజయపురం: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు గతంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించారు. అయితే అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారిపోయాయి. తడి, పొడి చెత్తను వేరు చేసి ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు తరలించే పనులు నిలిచిపోయాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు ఆదాయం పొందాలనే సదుద్దేశంతో వీటి నిర్మాణం చేపట్టారు. కానీ ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కనిపించడం లేదు. విజయపురం మండల పరిధిలోని 25 పంచాయతీలో 24 డంపింగ్ యార్డులు నిర్మించారు. ఒక్కో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50లక్షలు ఖర్చు చేసింది. అయితే కేవలం విజయపురం మండలంలో కేవలం నాలుగు పంచాయతీల్లో మాత్రమే డంపింగ్ యార్డులు వినియోగంలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలినచోట్ల అలంకారప్రాయంగా ఉన్నాయి. ఇటీవల గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హి కార్యక్రమం 15 రోజుల పాటు నిర్వహించారు. కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యారు తప్ప క్షేత్ర స్థాయిలో అమలు చేయలేదు.

పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం

డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువు తయారీతోపాటు వానపాములను ఉత్పత్తి చేయాలి. ఇక్కడ తయారైన ఎరువును రైతులకు విక్రయిస్తే పంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుంది. కానీ, చెత్తతో ఎరువులు తయారు చేస్తున్న ఘటనలు ఏ ఒక్క గ్రామంలో మచ్చుకైనా కనిపించడం లేదు. డంపింగ్ యార్డులకు చెత్తను తీసుకురాకుండా గ్రామాల సమీపంలోని పాత వ్యవసాయ బావులు, గుంతల్లో పడేస్తున్నారు. అయినా పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. డంపింగ్ యార్డుల్లో చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ, వానపాముల ఉత్పత్తి చేసే విధానంపై శిక్షణ ఇవ్వాలి. కానీ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు.

శిథిలమవుతున్న రిక్షాలు

పంచాయతీల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి వాటిని డంపింగ్ యార్డుకు తరలించడానికి ప్రభుత్వం రిక్షాలను అందజేసింది. అయితే వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో శిథిలమవుతున్నాయి. దీంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. ఈక్రమంలో గ్రామస్తులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసేస్తున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారిపోవడంతో పల్లెవాసులు బహిరంగంగానే అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచాలని కోరుతున్నారు.

చిన్నబ్బరెడ్డి కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ గుర్రంవారికండ్రిగ గ్రామంలో మృతి చెందిన చిన్నబ్బరెడ్డి కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయమణస్వామి పరామర్శించారు. మాజీ మంత్రి నారాయణస్వామి శుక్రవారం గ్రామంలో పర్యటించి, మృతుడు చిన్నబ్బరెడ్డి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ లోకనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాయకులు చిన్నస్వామి, విజయశేఖర్‌రెడ్డి, రమణ, గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


నరసింహాపురం అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మెనూ ప్రకారం మంచి భోజనం పెట్టాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నరసింహాపురం, తిరుమల రాజుపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్లతో ఆయన మాట్లాడుతూ పిల్లలకు ప్రతి రోజు ఉడికించిన గుడ్డు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు తప్పకుండా పిల్లలకు వీలైనంత వరకు తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు, పాటలు నేర్పించాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం మెనూ ప్రకారం తాజా కూరగాయలతో కూడిన భోజనం పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ భారతికి సన్మానం


ఎస్‌ఐ భారతికి సన్మానం

పాలసముద్రం: ఎస్‌ఐ భారతి అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఏఎస్‌ఐ రవి మాట్లాడుతూ మండలంలో ఎస్‌ఐ భారతి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆమెను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం పోలీస్ జీప్, ద్విచక్ర వాహనాలకు ఆయుధపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ లక్ష్మి, రజని, మహేష్, నవీన్, పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు పరిశీలన


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఈఈ పి.వి.నరేంద్రకుమార్

శ్రీరంగరాజపురం: మండలంలోని మెదవాడ పంచాయతీ మర్రిపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వేస్తున్న నూతన పైపులైన్‌ను గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఈఈ పి.వి.నరేంద్రకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో నూతన పైపులైన్‌ను వేస్తున్నామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్, వాటి పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. నవంబర్ 15 లోగా పైపులైన్‌ను పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు ఏఈ కుమార్‌స్వామి, సర్పంచ్ ఉమామహేశ్వరి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

డిసెంబర్ 14న లోక్ అదాలత్


రాఘవేంద్ర, న్యాయమూర్తి

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అత్యధిక కేసుల పరిష్కారానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చునని చెప్పారు. రాజీకి లోబడిన క్రిమినల్, మనోవర్తి కేసులను పరిష్కరించుకుని నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని, దీనిపై అపీలుకు వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తిప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మండల పరిషత్ ఏఓగా లోకేష్



గంగాధరనెల్లూరు: మండల పరిషత్ కార్యాలయ ఏఓ గా లోకేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై గంగాధరనెల్లూరుకు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేస్తోన్న సుధాకర్ సస్పెండ్ కావడంతో కొన్ని నెలలుగా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పోస్ట్ ఖాళీగా ఉంది.

పకడ్బందీగా పశుగణనకు శ్రీకారం

- 120 రోజుల పాటు నిర్వహణ
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- మొత్తం ప్రక్రియకు ఇద్దరు సూపర్‌వైజర్లు, 14 ఎన్యూమరేటర్ల నియామకం
- గణన ఆధారంగానే ఇక బడ్జెట్


పశుగణన ప్రారంభిస్తున్న సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్లు

నగరి : ఐదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 21వ పశుగణనకు పశు సంవర్ధక శాఖ శుక్రవారం శ్రీకారం చుట్టింది. ఈమేరకు నగరి ఏడీ పరిధిలోని ఎం.కొత్తూరులో పశుగణనను ప్రారంభించింది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనుంది. 2025 ఫిబ్రవరి 24వ తేదీ వరకు పశుగణన కొనసాగనుంది.

సిబ్బందికి శిక్షణ

నగరి ఏడీ పరిధిలోని 25 వేల నివాసాల్లో పశుగణన కోసం 14 మంది ఎన్యూమరేటర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించడంతో పాటు పశువుల లెక్కింపు విధానంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. నగరి పరిధిలో 20వ పశుగణన మేరకు ఆవులు 22712, గేదెలు 1529, మేకలు 23989, గొర్రెలు 16063, కోళ్లు 12404 ఉన్నాయి.

ప్రతి ఇంటికీ వెళ్లి నమోదు

పశు గణనకు ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలు, చూడి, పాడి పశువులు, జెర్సీ, ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్లు, కోళ్లఫారాల్లోని కోళ్లు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, ఎద్దులు తదితర మూగజీవాల వివరాలను సేకరించి, వాటిని ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సిఉంది. సంకర జాతి, దేశీయ జాతి పశు సంపదను వేర్వేరుగా సేకరిస్తారు. ప్రతి అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పథకాల రూపకల్పనకు అవకాశం

పశు గణన ద్వారా గతంలో కంటే పశువుల సంఖ్య పెరిగిందా, తగ్గిందా అనే వివరాలు తెలుస్తాయి. తద్వారా పశువుల కోసం, పశు పోషకుల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలి. పశు వైద్యశాలలు, వైద్యుల సంఖ్యను పెంచాలా లేదా తదితర అంశాలకు ప్రణాళికను రూపొందించేందుకు వీలవుతుంది. పాలు ఇచ్చే పశువులు ఎన్ని, పాలు ఇవ్వని పశువులు ఎన్ని అనే వివరాలు కూడా తెలుస్తుంది. గతంలో కంటే పాడి అవసరం ఎంత మేరకు ఉంది. మందులు సరిపడా ఉన్నాయా.. లేవా అనే వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. తద్వారా పాడి పరిశ్రమకు ఏ మేరకు నిధులు కేటాయించాలనే విషయమై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది.

పశు సంవర్ధనే లక్ష్యం


పశు గణనను ప్రారంభిస్తున్న వెటర్నరీ ఏడీ మురళీమోహన్, సర్పంచ్ నీలావతి

గంగాధరనెల్లూరు: దేశవ్యాప్తంగా జరుగుతున్న పశుగణన కార్యక్రమం శుక్రవారం నుంచి జీడీ నెల్లూరు, పాలసముద్రం మండలాల్లో ప్రారంభించినట్లు పశు సంవర్ధక శాఖ మండల ఏడీ మురళీమోహన్ తెలిపారు. గంగాధరనెల్లూరు మండలంలోని కె.నాసంపల్లి గ్రామ సర్పంచ్ నీలావతి చేతుల మీదుగా శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మురళీమోహన్ మాట్లాడుతూ జీడి నెల్లూరు మండలంలో 17006, పాలసముద్రం మండలంలో 3387 హౌస్‌హోల్డ్‌లో పశుగణన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పశువులు ఉన్న కుటుంబాలే కాకుండా లేని కుటుంబాలను కూడా సర్వే చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ప్రధాన వనరులుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగు పరచడమే ఈ పథకాల లక్ష్యమని వివరించారు. ఈ-పథకాల రూపకల్పన ద్వారా రైతులకు చేకూర్చనున్నట్లు తెలిపారు. కోళ్లు, మేకలను కూడా పశు గణనలో నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ నాగాంజనేయులు, గణేష్, సుబ్రహ్మణ్యం, అనిమల్ హస్బండరీ వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సహకరించండి



పశుగణనకు వచ్చే ఎన్యూమరేటర్లకు పశు పోషకులు కచ్చితమైన వివరాలను తెలియజేసి సహకరించాలి. వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తారు. కాబట్టి సమగ్ర సమాచారాన్ని ఎన్యూమరేటర్‌కు తెలపాలి. గణనతో పశుపోషకులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

– డాక్టర్ వాసు, ఏడీ, పశు సంవర్ధక శాఖ, నగరి

టీడీపీ–జనసేన కుమ్ములాట


పోలీస్ స్టేషన్ ఆవరణలో టీడీపీ నాయకుల ధర్నా

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు బుధవారం రాత్రి తమిళనాడు సరిహద్దుల్లోని అత్తిమాంజేరిపేటలో కుమ్ములాటకు దిగారు. శుక్రవారం టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జనసేన నాయకుడు, ఓ పత్రికా విలేకరిపై కేసులు పెట్టాలని కోరారు. ఎస్‌ఐ భారతి ఘర్షణ జరిగిన ప్రాంతం తమ పరిధిలో లేదని, సంఘటనా స్థలం ఉన్న ప్రాంతంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో మండల పరిధిలోని టీడీపీ నాయకులు రెచ్చిపోయి, గుంపులు గుంపులుగా టీడీపీ జెండాలతో పోలీస్‌స్టేషన్‌కి వచ్చారు. విషయం తెలుసుకున్న సీఎం హనుమంతప్ప పోలీస్‌స్టేషన్ చేరుకుని ఎస్‌ఐ భారతితో ఘర్షణ కేసు దర్యాప్తు చేయించారు. అప్పటికే టీడీపీ నాయకులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మెడికల్ సర్టిఫికెట్ తీసుకొచ్చి హత్యాయత్నం కేసు పెట్టాలని కోరారు. అయితే చట్టం మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ధర్నాకు పూనుకున్నారు. తమిళనాడుకి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు పత్రికలో రాసినందునే టీడీపీ నాయకులు పత్రికా విలేకరిపై కేసులు పెట్టాలని ఒత్తిడి చేసినట్టు సమాచారం.

నాటు సారా స్థావరాలపై దాడులు


స్వాధీనం చేసుకున్న సారా ఊటతో పోలీసులు

శ్రీరంగరాజపురం: నాటు సారాయి స్థావరాలపై చిత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కార్వేటి నగరం ఎక్సైజ్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. మండలంలోని చిన్నతయ్యూరు గ్రామంలో శుక్రవారం మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో దాదాపు 1100 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్నతయ్యూరు గ్రామంలో నాటు సారాయి స్థావరాలు ఎక్కువగా ఉన్నాయనే రహస్య సమచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారాయి కాచినా, అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే వారిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు. ఆయనతో పాటు ఎక్సైజ్ ఎస్‌ఐ సుబ్రమణ్యం, ఎక్సైజ్ సిబ్బంది దేవప్రసాద్, రాజేష్, తంబేష్, హేమాద్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితుడు

నగరి : సత్రవాడ చెరువు సమీపంలో సారా తయారుచేస్తున్న కరివర్ధన్ అనే వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేశ్వర్ వెల్లడించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న నెహ్రూ యువకేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ ప్రదీప్

కార్వేటినగరం: యువత, విద్యార్థుల జీవితాలను హరించే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ ప్రదీప్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువజన కేంద్రం చిత్తూరు వారి సహకారంతో మాదక ద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రాణాంతకమైన గుట్కా, గంజాయి తదితర మత్తు పదార్థాలను తీసుకోవడంతో చిన్న వయస్సులోనే రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నారని గుర్తు చేశారు. అనంతరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకంతో కలిగే అనర్థాలను క్షుణ్ణంగా వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ధనుంజయరెడ్డి, క్రాస్ సంస్థ సభ్యులు సోమశేఖర్, హరి, దొరస్వామి, మునికృష్ణ పలువురు పాల్గొన్నారు.

పాఠశాలలో వార్షిక తనిఖీ


సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : మండలంలోని సాల్వపట్టెడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా ఎంఈఓ శ్రీదేవి ఉదయమే పాఠశాలకు వచ్చారు. ప్రార్థన సమయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల నిర్వహణ తీరుతెన్నులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. అభ్యసన, బోధన తదితర విషయాలను గమనించారు. మధ్యాహ్నం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను ఇదేవిధంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆధునిక వ్యవసాయంతో ఆదాయం


రుణ కార్డులు అందుకున్న రైతులతో రాస్ అధికారులు

పుత్తూరు: ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా అధిక ఆదాయం ఆర్జించవచ్చని కృషి విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త టి.రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాస్ కార్యాలయంలో నేటి వ్యవసాయం–ఆధునిక సాంకేతికపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగు ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించడానికి లోతు దుక్కులు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణ, సమగ్ర వ్యవసాయ విధానం, నేరుగా వరి విత్తే డ్రంసీడర్ విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానం, వివిధ రకాల కషాయాలు, ఎరువుల గురించి వివరించారు. అనంతరం నగరి మండలానికి చెందిన 90 మంది మహిళా రైతులకు రుణాలు పంపిణీ చేశారు. నెలవారీ రుణాల చెల్లింపు కార్డులను రైతులకు అందించారు. కార్యక్రమంలో రాస్ అధికారి రవి, సిబ్బంది ప్రకాష్, మణి, శేఖర్ పాల్గొన్నారు.

క్వారీ రద్దు కోసం 4న నిరసన దీక్ష


మాట్లాడుతున్న నాగరాజు

నగరి : పట్టణ సమీపంలోని క్వారీలకు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ నవంబర్ 4వ తేదీన ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీక్షకు అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలు, నేతలు షబ్బీర్‌బాషా , ఎస్‌విజయ్ కుమార్, శేఖర్, ఏఐటీయూసీ నేతలు చందామరై, టి. శేఖర్ పాల్గొన్నారు.

పంటకు 'తాగునీరు'!



విజయపురం మండలంలోని గంగమాంబపురం ఎస్టీ కాలనీలో ఓ రైతు తాగు నీటినే పొలానికి సాగు నీరుగా వాడుతున్నాడు. పట్టించుకునే వారు లేకపోవడంతో యథేచ్ఛగా తాగునీటిని వృథా చేస్తున్నాడు. వందలాది మంది దాహార్తితో అలమటిస్తుంటే నీటిని దుర్వినియోగం చేయడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– విజయపురం